## క్లుప్తంగా

### ఉపాధి హామీ కూలీలకు 6 గంటల పని



రాంపురంలో ఉపాధి హామీ పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో వెంకటరావు

పెందుర్తి : జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు రోజులో 6 పని గంటలు ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని రాంపురంలో జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. జాబ్ కార్డుల హాజరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూడాలని సూచించారు. అనంతరం గ్రామంలో ఇంకుడు గుంతలను పరిశీలించారు. గ్రామ సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్నకుమార్, అధికారులు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్‌కు సామగ్రి అందజేత



సామగ్రి అందిస్తున్న క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు

పెందుర్తి : క్రెడిట్ యాక్సెస్ ఇండియా ఫౌండేషన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ లిమిటెడ్ కంపెనీ పెందుర్తి బ్రాంచి సీఎస్ఆర్ నిధులతో స్థానిక పోలీస్ స్టేషన్‌కు సామగ్రి అందజేశారు. వాటర్ డిస్పెన్సరీ, వాటర్ ప్యూరిఫైర్, మూడు స్టీల్ సోఫాలు అందించారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ సామగ్రిని ఎస్ఐ స్వామినాయుడుకు సంస్థ ప్రతినిధులు అందించారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వెంకటరమణ, రమేష్‌బాబు, రామచంద్రరావు, వెంకటరమణ పాల్గొన్నారు.


### అప్పన్నకు వైభవంగా కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేప చేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు.

### అప్పన్నను దర్శించుకున్న నేవీ అధికారి



నేవీ అధికారికి ప్రసాదం అందజేస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఈస్టర్న్ నేవల్ కమాండ్ కమాండింగ్ ఇన్ చీఫ్ ఫ్లాగ్ అధికారి వీఏడీఎం రాజేష్ పెండర్కర్ శనివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం సూపరింటెండెంట్ జీవీవీఎస్‌కే ప్రసాద్ అందజేశారు.

### భూ ఆక్రమణపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: విశాఖ పోర్టులో షిప్పింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న బోత్ర కంపెనీ ఒక ప్రైవేటు స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించి దందా నిర్వహిస్తున్న తీరుపై విశాఖ ఐజీకి ఫిర్యాదు అందింది. శనివారం ఐజీ కార్యాలయంలో స్థలం యజమాని శేషారెడ్డి భూ ఆక్రమణపై ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. పరవాడ మండలం స్వయంభువరం గ్రామంలో సర్వే నంబర్ 34లోని 3.65 ఎకరాల భూమిని స్థానంరెడ్డి శేషారెడ్డి, కశిరెడ్డి రంగారావు, అచ్యుత రామరాజు కలిసి కొనుగోలు చేశారు. ముగ్గురు సమాన వాటాలతో భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. నిర్వహణ బాధ్యతను రామరాజుకు అప్పగించారు. అతడు మిగిలిన తమ ఇద్దరి అనుమతి లేకుండా బోత్ర కంపెనీతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, ఆ స్థలంలో అక్రమంగా రోడ్డు నిర్మించి హిందూ ప్లాంట్‌కు కోల్ సరఫరా చేస్తున్నారని శేషారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. వేరే రోడ్డు మార్గంలో సరఫరా చేయకుండా తమ సొంత స్థలాన్ని అనుమతి లేకుండా ఆక్రమించుకొని అక్రమంగా కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

# నాడు స్ఫూర్తిమంతం.. నేడు నిస్తేజం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రభుత్వ భవనాలకు నేడు నిధుల కొరత
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- భవనాలు పూర్తయితే సేవలందుతాయనే పేదల ఆశలపై నీళ్లు




పెదముషిడివాడలో మధ్యలోనే నిలిచిపోయిన గ్రామ సచివాలయ భవనం

పరవాడ: గ్రామీణ ప్రజలు నేరుగా ప్రభుత్వ సేవలు పొందేందుకు వీలుగా గత ప్రభుత్వం కోట్లాది రూపాయలతో గ్రామ సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్ల (విలేజీ హెల్త్ క్లినిక్) ఏర్పాటుకు రంగం సిద్ధం చేసి అప్పట్లో వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు వాటిలో కొన్నింటిని పూర్తి చేశారు. మరికొన్ని ప్రభుత్వ భవనాలు నిర్మాణ దశలో ఉండగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ దశలో ఉన్న భవనాలు పూర్తి కాలేదు. ఈ ప్రభుత్వం వాటికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో గ్రామీణ ప్రజలు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల ద్వారా పొందనున్న సేవల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 2019–21 మధ్య పరవాడ మండలంలో 14 గ్రామ సచివాలయ భవనాల నిర్మాణానికి రూ.4.40 కోట్లు, 11 రైతు భరోసా కేంద్ర భవనాల నిర్మాణం కోసం రూ.2.39 కోట్లు, 9 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి రూ.1.87 కోట్లు మంజూరు చేసింది. నాడు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో కాంట్రాక్టర్లు అనేక భవన నిర్మాణాలు పూర్తి చేశారు. మండలంలో మంజూరైన 14 గ్రామ సచివాలయ భవనాల్లో 11 భవనాలను పూర్తి చేసి వాడచీపురుపల్లి–2, పెదముషిడి వాడ, రావాడ గ్రామ సచివాలయ భవనాలను అసంపూర్తిగా వదిలేశారు. గమ్ములు, విద్యుత్ సదుపాయం, కిటికీలు, తలుపులు అమర్చకుండా వదిలేశారు. 11 ఆర్‌బీకే భవనాలకు గాను వెన్నెలపాలెం, నాయుడుపాలెంలో పూర్తి చేసి మిగిలిన 9 రైతు భరోసా కేంద్ర భవనాలు పూర్తి చేయలేదు. పెదముషిడివాడ, పరవాడ, గొర్లివానిపాలెం, కలపాక, రావాడ, భర్నికం, వాడచీపురుపల్లి గ్రామాల్లోని ఆర్‌బీకే భవన నిర్మాణాలు పూర్తి అయినా తలుపులు, కిటికీలు, గచ్చులు, పెయింటింగ్స్, విద్యుత్ వంటివి మిగిలి ఉన్నాయి. కన్నూరు ఆర్‌బీకే బేస్‌మెంట్ లెవల్‌లో ఉంది. అలాగే 9 వెల్‌నెస్ సెంటర్లు మంజూరు కాగా వాటిలో వెన్నెలపాలెం, నాయుడుపాలెం, కలపాక గ్రామాల్లోని భవన నిర్మాణాలు పూర్తి చేశారు. కన్నూరులో మంజూరైన వెల్‌నెస్ సెంటర్ భవనం బేస్‌మెంటు లెవల్‌లో ఉంది. పెదముషిడివాడ, తానాం, గొర్లివానిపాలెం, రావాడ, ముత్యాలమ్మపాలెం గ్రామాల్లోని విలేజీ హెల్త్ క్లినిక్ సెంటర్ల భవన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అసంపూర్తి ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయడానికి కూటమి ప్రభుత్వం విడుదల చేసే నిధుల కోసం ఆయా గ్రామాల ప్రజలు ఎదురు చూస్తున్నారు.



ముత్యాలమ్మపాలెంలో నిర్మాణం మధ్యలోనే నిలిచి పోయిన వెల్‌నెస్ సెంటర్



పెదముషిడివాడలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్



రావాడలో పూర్తి కాని ఆర్‌బీకే భవనం



కలపాకలో అసంపూర్తిగా నిలిచిపోయిన వెల్‌నెస్ సెంటర్

### అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనం



వాడచీపురుపల్లిలో గ్రామ సచివాలయం–2 భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి. భవనంపై శ్లాబు పనులు పూర్తి చేసి మిగిలిన పనులు అసంపూర్తిగా నిలిపేశారు. భవనానికి ప్లాస్టింగులు, విద్యుత్ సదుపాయం, గచ్చులు, తలుపులు, కిటికీల వంటి పనులు చేయాల్సి ఉంది. భవన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం సచివాలయం–2 కార్యకలాపాలు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– **కూండ్రపు తాతాజీ**, వాడచీపురుపల్లి

### ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది



కలపాకలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్ర భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ఎరువులు, విత్తనాలకు దూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సి వస్తుంది. సాగుపై సరైన సలహాలు, సూచనలు అందడం లేదు. ఆర్‌బీకే భవన నిర్మాణ పనులను ఏళ్ల తరబడి సాగదీస్తున్నారు. వ్యవసాయ పనుల కోసం పరవాడ వ్యవసాయ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుంది. ఆర్‌బీకే భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలి.

– **అప్పారావు, రైతు**, స్వయంభూవరం

### నానా అవస్థలు పడుతున్నాం



ప్రభుత్వ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో నానా అవస్థలు పడుతున్నాం. గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, ఆర్‌బీకే భవనాల నిర్మాణ పనులు దాదాపు పూర్తి చేశారు. నిధుల లేమితో ప్లాస్టింగులు, విద్యుత్ సదుపాయం, గచ్చుల వంటివి మిగిలి ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి అసంపూర్తి పనులు కొనసాగించేందుకు నిధులు మంజూరు చేయాలి.

– **పల్లా వెంకునాయుడు**, పెదముషిడివాడ

### వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



పెందుర్తి : స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన అనంతరం బాలభోగం నివేదించారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు కల్పించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

### పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పరిసరాలను శుభ్రం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు

పరవాడ: పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. పెదముషిడివాడ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీవో వి.ధర్మారావు పాల్గొని శనివారం పరిసరాలను చీపురుతో శుభ్ర పరిచారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిసరాలతో పాటు ఇంటి చుట్టూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరుచేసి క్లాప్ వాహనాలకు అందించాలన్నారు. అనంతరం సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా వీరాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం



మాజీ డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సబ్బవరం: మండలంలోని మొగలిపురం శివారు వీరాంజనేయ స్వామి వారి నూతన ఆలయ ప్రారంభోత్సవం ఆదివారం జరగనున్న సందర్భంగా శనివారం ఆలయంలో హోమం నిర్వహించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు, అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, యడ్ల నాయుడు, ఐడీ బాబు, గండి ముత్యాలనాయుడు, సురేష్, కన్నంనాయుడు, మోహన్, దేముడు నాయుడు, రమేష్, నవీన్, చెల్లంనాయుడు, ఆనంత్ తదితరులు పాల్గొన్నారు.

### 26న మహా శివరాత్రి ప్రత్యేక పూజలు

సింహాచలం : మహా శివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 26న సింహగిరి క్షేత్రపాలకుడు త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు విశేష అభిషేకాలు, రాత్రి 10.30 గంటల నుంచి మహా రుద్రాభిషేకం, లింగోద్భవ అభిషేకాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులంతా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## అల్లూరి పోరాటం మరువలేనిది



సీతమ్మధార అల్లూరి జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీడీఎస్‌వో నాయకులు

సీతమ్మధార : అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి కార్యక్రమంలో భాగంగా విశాఖపట్నం నుంచి అల్లూరి సమాధి ఉన్న క్రిష్ణదేవి పేట వరకు చేపట్టిన ప్రజా జాతాను శనివారం ఘనంగా ప్రారంభించారు. ప్రజాజాతాకు అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎస్.గోవింద రాజులు ఆహ్వానం పలికారు. ముందుగా సీతమ్మధార సర్కిల్‌లో ఉన్న అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశాన్ని నిరంకుశంగా 200 సంవత్సరాలకు పైగా పరిపాలించిన బ్రిటీష్ సామ్రాజ్యవాదుల దోపిడీ వ్యవస్థను కూకటి వేళ్లతో పెకలించేందుకు ఎందరో స్వాతంత్ర్య సమర యోధులు పోరాడారన్నారు. అలాంటి వారిలో మన్యం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు ఒకరిని కొనియాడారు. ప్రొఫెసర్ కొలవెన్ను చాంద్ మాట్లాడుతూ ఎంతో ధైర్య సాహసాలతో, రాజీలేని పోరాట మార్గంలో, సామాన్య ప్రజల పక్షాన నిలబడిన అల్లూరి సీతారామరాజు తన ప్రాణాలు సైతం అర్పించారన్నారు. డాక్టర్ రామచంద్ర రాజు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున జీవిస్తున్న ఆదివాసీల దుర్భర జీవితాన్ని చూసి చలించిపోయాడని, వారిలో స్వాతంత్ర్య కాంక్షను రగిలించి, పోరాట యోధులుగా తయారు చేశారని గుర్తు చేశారు. ఏబీడీఎస్‌వో రాష్ట్ర అధ్యక్షుడు వి.హరీష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్య వ్యాపారంగా మారడం వల్ల విద్యార్థులు లక్షలాది రూపాయల ఫీజులు కట్టాల్సి వస్తోందన్నారు. మార్కులు, ర్యాంకుల కోసం విపరీతమైన ఒత్తిడి పెంచుతున్నారన్నారు. ఫలితంగా విద్యార్థులు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు సినిమాలు, మీడియాలో మితిమీరిన అసభ్యత, హింస, పోర్న్ వెబ్‌సైట్లు విద్యార్థుల ఆలోచనలను దారి తప్పిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ సత్యవతి, పౌర చైతన్య వేదిక కార్యదర్శి సీహెచ్ ప్రమీల, మహేష్, అభిలాష్, సంతోష్, శివ ప్రసాద్, పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్‌కు డిమాండ్

సీతంపేట : విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ అప్‌డేట్ చేయాలని, గత పదేళ్లుగా పెన్షన్ అప్‌డేట్ కాక ఎంతో నష్టపోతున్నామని ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ప్రెసిడెంట్ వారణాసి కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రాబ్యాంకు విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ రెండో ప్రాంతీయ సమావేశం శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఐదేళ్లకు పెన్షన్ రివైజ్ చేయాల్సి ఉన్నా గత పదేళ్లుగా చేయలేదన్నారు. పదవీ విరమణ చేసినప్పుడు ఎంత బేసిక్ ఉందో అంతే ఉందని, దీనివల్ల విశ్రాంత ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని వాపోయారు. వెంటనే పెన్షన్ అప్‌డేట్ చేయాలని డిమాండ్ చేశారు. ముందుగా బ్యాంకు వ్యవస్థాపకులు భోగరాజు పట్టాభి సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. సమావేశంలో అడ్వైజర్లు జి.ఎస్.వి.కృష్ణారావు, సత్యప్రసాద్, డీజీఎస్ వి.వాసుదేవ మూర్తి, ఏజీఎస్ టంకాల కామేశ్వరరావు, సీసీఎం మూల భాస్కర్, ఎం.జయరావు పాల్గొన్నారు.

## అబ్రకదబ్ర

- నేడు ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం
- 10 మంది ప్రముఖ మెజీషియన్లకు అవార్డుల ప్రదానం

డాబాగార్డెన్స్: లేనిది ఉన్నట్టు..ఉన్నది లేనట్టు చేయడమే ఇంద్రజాలం. మనిషిని గాల్లో వేలాడదీయం ..క్షణంలో ఏనుగును కళ్లముందు ప్రవేశపెట్టడం.. కళ్లుమూసుకుని తెరిచేలోపు మాయం చేయడం. చేతి రుమాల్లోంచి పావురాలు సృష్టించడం. న్యూస్ పేపర్లో నీరు పోసి అందులోంచి రక రకాల పువ్వులు, రంగు రంగుల చేతి రుమాళ్లు సృష్టించడం..మ్యాజిక్.. భారతీయ 64 కళల్లో ఇంద్రజాలం ఒకటి. ఈ కళకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన వారు..ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా ఫిబ్రవరి 23న ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

**నేడు 10 మంది ప్రపంచ మెజీషియన్ల ప్రదర్శన..**

ప్రపంచ ఇంద్రజాలికుల దినోత్సవం, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ 10వ వార్షికోత్సవం పురస్కరించుకుని అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు నగరంలోని కళాభారతి ఆడిటోరియం వేదికగా 10 మంది ప్రముఖ ప్రపంచ మెజీషియన్లు ప్రదర్శన ఇవ్వనున్నారు. సాయంత్రం 6 నుంచి నాన్‌స్టాప్‌గా 3.30 గంటల పాటు ప్రదర్శన చేపట్టనున్నారు. ప్రపంచ ప్రఖ్యాత భారతీయ మహేంద్ర జాలికుడు పీసీ సర్కార్ తనయుడు, జూనియర్ పీసీ సర్కార్‌కు ఐఎంఏ జీవన సాఫల్య పురస్కారంతో పాటు 10 మంది దేశ, విదేశీ మెజీషియన్లకు ఐఎంఏ అవార్డులు ప్రదానం చేయనున్నారు.



మేజిక్ ప్రదర్శనలో ప్రముఖ మెజీషియన్ బీఎస్ రెడ్డి

### స్ట్రీట్ మెజీషియన్ వద్ద ఇంద్రజాలం నేర్చుకున్నా..

ఒక స్ట్రీట్ మెజీషియన్ వద్ద 1971లో ఇంద్రజాల విద్యనభ్యసించి, దేశం నలుమూలల ప్రదర్శన ఇస్తూ, ఎంతో మంది మన్ననలు పొందా. నా హాబీ ఇంద్రజాలం. గ్రేట్ మెజీషియన్ పీసీ సర్కార్ సన్నిహితుడ్ని. ఇంద్రజాల ప్రదర్శన ద్వారా తనను ప్రోత్సహిస్తూ ఎవరైనా పారితోషికం ఇస్తే అనాథశ్రామాలకు ఉపయోగిస్తున్నా.. ఇప్పటి వరకు అనేక సత్కారాలు పొందాను. మామిడి టెంకను మట్టిలో పాతి, అప్పటికప్పుడు మొక్కను సృష్టించి కాయలు పూయించి స్టేజీపై చూపించగలను.

–కె.విజయ్‌కుమార్, మెజీషియన్, డిప్యూటీ మేనేజర్, ఎలక్ట్రికల్ డిపార్టుమెంట్, వైజాగ్ స్టీల్‌ప్లాంట్

### మ్యాజిక్..నాలుగు విధాలు..



ఇంద్రజాలం నాలుగు భాగాలుగా ఉంటుంది. క్లాసిక్, కన్జూరింగ్, క్లోజప్, ఎలీసన్ విభాగాలుగా ఉంటున్నాయి. పురాతన పద్ధతిలో మామిడి టెంకలు నాటి అప్పటికప్పుడే మొక్కలు పుట్టించడం, వాటికి కాయలు కాయించడం వంటివి క్లాసిక్‌గాను, ఎదుట వ్యక్తితో మాట్లాడుతూనే అతి దగ్గరగా ఇంద్రజాలం ప్రదర్శించడాన్ని క్లోజప్‌గా గుర్తించారు. ఖాళీ డబ్బాల నుంచి వివిధ రకాల వస్తువులు తీయడం ఎలీసన్‌గాను, ఏదైనా ఒక వస్తువు స్వరూపాన్ని మార్చి తిరిగి దాని పూర్వపు స్వరూపానికి తేవడాన్ని కన్జూరింగ్‌గా గుర్తించారు. ఏ ఇంద్రజాలికుడైనా వీటిని ప్రదర్శించాల్సిందే ఐఎంఏ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని పీసీ సర్కార్ జూనియర్‌కు ఐఎంఏ జీవన సాఫల్యంతో పాటు ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలికులను సత్కరించనున్నాం.

–బీఎస్ రెడ్డి. ఇంద్రజాలికుడు, ఇండియన్ మ్యాజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు

### మ్యాజిక్‌తో పాటు హాస్యం పండించాలి



నగరంలో ప్రొఫెషనల్ మెజీషియన్‌గా గుర్తింపు పొందడం చాలా ఆనందంగా ఉంది. ఇప్పటి వరకు 4 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చా. జాదూ సామ్రాట్ అవార్డు పొందా.. తనకు చేతనైన సేవలు చేస్తున్నాను. ఇండియన్ మ్యాజిక్ అకాడమీ ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాల ప్రజలో మూఢనమ్మకాలను పారదోలేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నా..క్షుద్ర విద్యలు, బాబాలు, దెయ్యాల వంటి వాటిపై అవగాహన కల్పిస్తున్నా. సాధారణ మ్యాజిక్‌తో పాటు కామెడీ మ్యాజిక్‌లు చేయాలన్నది లక్ష్యం. మూడు పీజీలు చేశా. ఏయూలో ఎంఎస్సీ సైకాలజీ కూడా పూర్తి చేశాను. గతేడాది బెస్ట్ మెజీషియన్ అవార్డు (లైమ్‌లైట్) అందుకున్నా.

–అన్వర్ బాషా, మెజీషియన్

### రైల్వే స్టేషన్‌లో 60 కేజీల గంజాయి స్వాధీనం



నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ అధికారులు

తాటిచెట్లపాలెం : విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా గంజాయి అక్రమంగా రవాణా చేస్తున్న ముగ్గురిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలప్రకారం... విశాఖపట్నం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ సిబ్బందితో కలిసి శనివారం విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో ఢిల్లీకి చెందిన బినా, పూజా అరోరా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం బరేలి జిల్లాకు చెందిన వివేక్ విశాఖపట్నం స్టేషన్ మీదుగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అదుపులోకి తీసుకుని, వారి నుంచి 60 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.